రెడ్డిపల్లెలో ప్యాసింజర్ రైళ్లను నిలపాలి

ప్రజాశక్తి-పుల్లంపేట

బ్రిటిష్ కాలంనాటి రెడ్డిపల్లె రైల్వే స్టేషన్‌లో కరోనా కంటే ముందుగా నిలుస్తున్న ఇంటర్‌సిటి, అరకోణం ప్యాసింజర్ రైళ్లను తిరిగి పునరు ద్ధరించాలని గుంతకల్ డిఆర్‌ఎం చంద్రశేఖర్‌గుప్తాను కోరినట్లు గుంతకల్ రైల్వే బోర్డు సభ్యులు తల్లెం భరత్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం డిఆర్‌ఎం కలిసి వినతిపత్రం అం దించినట్లు తెలిపారు. రైల్వేకోడూరు రైల్వేస్టేషన్‌ను అభివృద్ధి చేయాలని, చెన్నై ఎక్స్ ప్రెస్, రైళ్లకు స్టాపింగ్ కల్పించాలని కోరినట్లు తెలిపారు. పేదలకు ఎంతగానో ఉప యోగపడే మరికొన్ని ప్యాసింజర్ రైళ్ల ను ఈ మార్గంలో ప్రవేశపెట్టాలని డిఆర్‌ఎం దృష్టి కి తీసుకెళ్లినట్లు తెలిపారు. ఇంటర్‌సిటి, ప్యాసింజర్ రైలు రద్దు చేయడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ప్రజల శ్రేయస్సు కోసం ప్రత్యామ్నాయంగా కొత్త రైళ్లను ప్రవేశపెట్టాలన్నారు.

జ్యోతి క్షేత్రంపై మళ్లీ
అటవీశాఖ దూకుడు

భవనాల కూల్చివేతకు రంగం సిద్ధం

ఆలయ కమిటీకి ఇప్పటికే హెచ్చరికలు జారీ

ఆందోళనలో లక్షలాది కాశినాయన భక్తులు

ప్రజాశక్తి-కాశినాయన

జ్యోతిక్షేత్రంపై అటవీశాఖ అధికారులు మళ్లీ దూకుడు పెంచారు. ఆలయానికి సంబంధించిన భవనాలను కూల్చి వేతకు రంగం సిద్ధం చేశారు. ఇప్పటికే ఆలయ కమిటీ వారికి హెచ్చరికలు జారీ చేశారు. జ్యోతి క్షేత్రం తమ ప్రాంత పరిధిలో ఉందని, త్వరగా కేంద్ర ప్రభుత్వ అటవీశాఖ నుంచి అను మతులు తెచ్చుకోవాలని ఆలయ కమిటీ వారికి పదే పదే నోటీసులు జారీ చేశారు. దీంతో ఎక్కడ ఆలయాన్ని, సత్రాలను, భవనాలను ఎక్కడ కూల్చి వేస్తారోనని మండల వాసులతోపాటు పలువురు యాత్రికులు, పక్క రాష్ట్రాల్లోని కాశినాయన భక్తులు ఆందోళన చెందుతున్నారు. అటవీశాఖ నుంచి అను మతులు తెచ్చుకోనియెడల ఆలయానికి సంబంధించిన గదులను కూల్చేందుకు డోజర్లను సిద్ధంగా ఉంచారు. ఇప్పటికే పలు భవనాలను కూల్చేశారు. కాశినాయన జ్యోతిక్షేత్రానికి ఎంతో ప్రాముఖ్య ఉంది. సుమారు 29 ఏళ్ల నుంచి కాశిరెడ్డినాయన క్షేత్రంలో వెలసి ఉన్నాడు. అప్పటి నుంచి ప్రతి సంవత్సరం ఉత్సవాలు వైభవంగా నిర్వహించడం ఆనవాయితీగా మారింది. వేడుకలకు ఉమ్మడి జిల్లా నుంచేగాక ఇతర రాష్ట్రాల నుంచి యాత్రికులు ఇక్కడి వస్తుం టారు. వేడుకల సమయంలో ఆర్‌టిసి వారు ప్రత్యేక బస్సులు కూడా ఏర్పాటు చేసేవారు. గతంలో నిర్వహించిన తిరుణాలకు అటవీశాఖ అధికారులు బస్సు లను నిలుపుదల చేశారు. స్థానిక రాజకీయ నాయకులు అప్పటి కలెక్టర్ అను మతి ఉత్తర్వులు తెచ్చుకుని యాత్రికుల కోసం మూడు రోజులు మాత్రమే తిరు ణాలకు బస్సులు తిరిగేలా చర్యలు తీసుకున్నారు. అప్పట్లో కలెక్టర్ కూడా అటవీశాఖ అధికారులను పిలించి వార్నింగ్ ఇచ్చినట్లు సమాచారం. అటవీశాఖ అధికారుల వల్ల భక్తుల మనోభావాలు దెబ్బతినే ప్రమాదముంది. ఇలాగే ఉంటే తాము కాశినాయన ఆలయాన్ని కోల్పోతామెమోనని పలువురు ఆందోళన చెందు తున్నారు. వాస్తవానికి అనాథలు, కొడుకులు వదిలేసిన తల్లిదండ్రులు, దిక్కు లేనివారు జ్యోతిక్షేత్రంలో తలదాచుకుంటున్నారు. అటవీశాఖ చర్యల వల్ల అంద రూ భయాందోళన చెందుతున్నారు. ఆలయ కమిటీ వారు అనుమతులు తెచ్చు కోకపోతే మరో రెండు రోజుల్లో భవనాలను కూల్చేందుకు అటవీశాఖ రంగం సిద్ధం చేసింది. కేంద్ర ప్రభుత్వ అటవీశాఖ నుంచి వారికి ఇంతవరకు అను మ తులు లభించడం లేదు. జ్యోతిక్షేత్రం ప్రాంతమంతా టైగర్ జోన్ ఉంది. దీంతో కేంద్ర ప్రభుత్వం అనుమతులు ఇవ్వడానికి నిరాకరిస్తున్నట్లు సమాచారం. అను మతుల కోసం స్థానిక రాజకీయ నాయకులు, ఆలయకమిటీ వారు ప్రయ త్ని స్తూనే ఉన్నారు. అటవీశాఖాధికారులు వీరి మొరను ఏమాత్రం ఆలకిం చకపోగా కూల్చివేతకుల రంగం సిద్ధం చేశారు.

ఇదీలా ఉంటే గత ఏడాది ఫిబ్రవరి 19న అప్పటి బద్వేల్ ఆర్‌డిఒ వెంకటరమణ, ప్రొద్దుటూరు డిఎఫ్‌ఒ భారీ బందోబస్తుతో వచ్చి 'ఇక్కడ అక్రమ కట్టడాలున్నాయి.. వాటిని తొలగించేందుకు అటవీశాఖ అనేక రకమైన చర్యలు చేపడుతుంది.. త్వరగా ప్రభుత్వాల నుంచి పర్మిషన్ తెచ్చుకోవాలి' అని ఉత్త ర్వులు జారీ చేశారు. మండల వాసులు, ఆలయ కమిటీ నిర్వాహకులు తమకు సమయం ఇవ్వాలని కోరడంతో వారు వెళ్లిపోయారు అప్పటినుండి క్రమే యం గా ఒక్కొక్కటి జ్యోతి క్షేత్రంలో తొలగిస్తూ వస్తున్నారు. ప్రస్తుతం మరి కొన్ని బి ల్డింగులు పడగొట్టేందుకు అధికారులు సిద్ధంగా ఉన్నట్లు సమాచారం.

కూల్చివేతకు వచ్చిన అధికారులను అడ్డుకుంటున్న స్థానికులు (ఫైల్‌ఫోటో)

భక్తుల మనోభావాలను దెబ్బతీస్తున్నారు

ఎపి, తెలంగాణా, తమిళనాడు రాష్ట్రాల నుంచి లక్షలాది మంది యాత్రికులు నిరంతరమూ కాశినాయన జ్యోతి క్షేత్రాన్ని సందర్శిస్తుంటారు. నిత్య అన్నదానం ఇక్కడి ప్రత్యేకత. భక్తుల మనోభావాలను దెబ్బతీసే విధంగా అటవీశాఖ అధికారులు ఉన్నారు. ఇది ఎంత మాత్రం న్యాయమో వారే చెప్పాలి.

- కె. రమణారెడ్డి, నరసాపురం.

భూసేకరణ పనులు పూర్తి చేయాలి : కలెక్టర్

ప్రజాశక్తి - కడప

జిల్లాలో జాతీయ రహదారులకు సంబంధించి భూసేకరణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. మంగళవారం అమరావతి నుంచి జాతీయ రహదారి భూసేకరణ పురోగతి పనులపై ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చీఫ్ సెక్రెటరీ కావేటి విజయానంద్ అన్ని జిల్లాల కలెక్టర్లతో వర్చువల్ విధానంలో సమీక్షించారు. ఈ కార్యక్రమానికి స్థానిక కలెక్టరేట్ బోర్డు మీటింగ్ హాలు నుంచి కలెక్టర్‌తోపాటు జాయింట్ కలెక్టర్ అదితి సింగ్, డిఎఫ్‌ఒ వినీత్ కుమార్, రెవెన్యూ, జాతీయ రహదారి అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా విసి ద్వారా రాష్ట్ర చీఫ్ సెక్రెటరీ కావేటి విజయానంద్ మాట్లాడుతూ జాతీయ రహదారి భూసేకరణకు సంబంధించి జిల్లాల్లో పెండింగ్ లో ఉన్న సమస్యలన్నిటిని ప్రాధాన్యత క్రమంలో త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్లకు సూచించారు. సిఎస్ విసి ముగిసిన అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం జాతీయ రహదారులు నిర్మాణానికి ఎంతో ప్రాధాన్యతనిస్తున్న దృష్ట్యా జిల్లాలో నిర్మితమవుతున్న పలు ప్రాజెక్టుల జాతీయ రహదారుల భూసేకరణకు సంబంధించి అవరోధాలను అధికమించి పనులు వేగవంతం చేయాలన్నారు. దీనికి సంబంధించి రెవిన్యూ డివిజనల్ అధికారులు, తహాశీల్దార్లు, జాతీయ రహదారుల అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. జాతీయ రహదారి భూసేకరణ పనుల త్వరితగతిన పూర్తవడానికి ప్రత్యేక బృందాలుగా ఏర్పడి కార్యాచరణ ప్రణాళిక రూపొందించుకొని పూర్తి చేయాలన్నారు. జాతీయ రహదారి భూసేకరణ పెండింగ్ పనులు సంబంధిత ఆర్‌డిఒ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి

టైటిల్ వివాదాలు, రెవెన్యూ భూ వివాదాలకు సంబంధించి ఓపెన్ ఫోరం ఏర్పాటు చేసి గ్రామాల వారిగా ప్రజలతో మాట్లాడి భూ సమస్యలను పరిష్కరించాలన్నారు. భూ సేకరణ చట్టం, పెండింగ్ ఆర్‌అండ్‌ఆర్ సమస్యలపై అధికారులకు జిల్లా కలెక్టర్ పలు సూచనలు చేశారు.ఫిబ్రవరి చివరి నాటికల్లా భూసేకరణ పనులు అన్నింటిని పూర్తి చేస్తామని చీఫ్ సెక్రటరీకి జిల్లా కలెక్టర్ వివరించారు. కార్యక్రమంలో డిఆర్‌ఒవిశ్వేశ్వర నాయుడు నేషనల్ హైవేస్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వెంకటపతి, ఎన్‌హెచ్ ఎఐ ప్రాజెక్ట్ డైరెక్టర్ అశోక్ కుమార్, ఆర్‌అండ్‌బి ఇఇ నేషనల్ హైవేస్ విజయ్ భాస్కర్ రెడ్డి, పులివెందుల ఆర్‌డిఒ చెన్నయ్య, జమ్మలమడుగు ఆర్‌డిఒ సాయి శ్రీ,,బద్వేల్ ఆర్‌డిఒ చంద్రమోహన్, కలెక్టరేట్ సెక్షన్ అధికారులు పాల్గొన్నారు.

కడప బాలోత్సవం పోస్టర్ ఆవిష్కరణ

పోస్టర్లు ఆవిష్కరిస్తున్న డిప్యూటీ డిఇఒ రాజగోపాల్‌రెడ్డి

ప్రజాశక్తి - కడప అర్బన్

కడప బాలోత్సవం 2వ పిల్లల పండుగ పోస్టర్‌ను జిల్లా ఉప విద్యాశాఖాధికారి రాజగోపాల్‌రెడ్డి మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం పిల్లలు చదువులతో కుస్తి పడుతూ, యాక్టివిటీస్ లేకుండా పోయాయని తెలిపారు. పిల్లల మనోవికాసానికి చదువుతోపాటు ఇతర ఆటపాటలు, చిత్రలేఖనం, మట్టితో బొమ్మలు లాంటివి ఉత్సాహాన్ని నింపుతాయని చెప్పారు. దానితో చదువులలో రాణిస్తారన్నారు. బాలోత్సవం అధ్యక్షులు గుర్రాల గోపాల్ మాట్లాడుతూ ప్రస్తుత రాకెట్ యుగంలో మానవ సంబంధాలు, కుటుంబ బంధాలు, స్నేహ భావాలు బలహీనపడ్డాయని చెప్పారు. సహకారతత్వం సడులుతోందని పేర్కొన్నారు. పెద్దవారికి, సాటి వారికి సేవ చేయాలనే భావన కొరవడుతోందన్నారు. చదువులతో కష్టపడే పిల్లలకు బాలోత్సవం ఓ పండుగ, ఒక ఆటవిడుపు, ఒక వేడుక, ఒక మహోత్సవం అన్నారు. అన్ని పాఠశాలల కలయిక జీవితాంతం గుర్తుండే సంఘటన ఇంటి బయట వెళ్లి విరిసే ఆహ్లాదం మన చిన్నారులతోనే కావున కడప బాలోత్సవం 'రెండవ పిల్లల పండుగ'ను విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి రాజశేఖర్ రాహుల్, సత్యనారాయణ, రామకృష్ణారెడ్డి, శ్రీనివాసులు, సుందరయ్య, రమణ రెడ్డి, బ్రహ్మానంద రెడ్డి, ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులు, విజయభాస్కర్ రెడ్డి హాజరయ్యారు.

రక్త దాతను సన్మానిస్తున్న అతిథులు

20 వేల రక్తదాతల మైలురాయి పూర్తి

- ఖూన్ కా రిష్టా ట్రస్ట్ చైర్మన్ తారిఖ్

ప్రజాశక్తి - కడప అర్బన్

ఖున్ కా రిష్టా ఛారిటబుల్ ట్రస్ట్ ఆఫ్ ఇండియా సేవలు 20 వేల రక్తదాతల మైలురాయిని పూర్తి చేసుకుందని ట్రస్ట్ చైర్మన్ యం.తారిఖ్ అలి పేర్కొన్నారు. మంగళవారం రక్తదాతను సన్మానించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ డీసిసి అధ్యక్షులు నజీర్ అహ్మద్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 10 ఏళ్లలో ఖూన్ కా రిష్టా సంస్థ వారు 20,000 మంది దాతల నుంచి రక్తాన్ని సమీకరించి అత్యవసర సమయాల్లో ఎంతో మంది ప్రాణాలను కాపాడిన ట్రస్ట్ చైర్మన్ తారీక్, వారి మిత్ర బృందాన్ని అభినందించారు. 26న జరిగే గణతంత్ర దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి చేతుల మీదుగా ఖూన్ కా రిష్ట స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకులు తారీక్ గారికి అవార్డు ప్రదానం చేయాలని కోరారు. చైర్మన్ యం.తారీఖ్ అలి సోమవారం మాట్లాడుతూ అన్ని సంబంధాల కన్న రక్త సంబంధం గొప్పదనే స్ఫూర్తితో ముందుకు వెళుతున్నామని చెప్పారు. అనంతరం రక్తదాత అరిఫ్ మొహమ్మద్, 10 మంది రక్తదాతలను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో బ్లడ్ బ్యాంక్ ఇన్‌ఛార్జి టెక్నీషియన్లు శ్యామ్, రామ్, హర్ష సంఘ సేవకులు మౌలా అలి సయ్యద్, షఫీఉల్లా, టిడిపి నాయకులు అబ్దుల్లా, కరీం, జన వికాస్ అధ్యక్షుడు తాహిర్, నిసార్, జావిద్, బిలాల్, షాజహాన్ పాల్గొన్నారు.

పీజీ ప్రవేశాల కౌన్సెలింగ్ షురూ

ప్రజాశక్తి - కడప అర్బన్

యోగివేమన విశ్వవిద్యాలయంలో 2024-25 విద్యా సంవత్సరానికి పీజీ ప్రవేశాల కౌన్సెలింగ్ మంగళవారం ఎపిజె అబ్దుల్ కలాం గ్రంథాలయ ప్రాంగణంలోని ప్రవేశాల సంచాలకుల కార్యాలయ విభాగంలో ప్రారంభమైంది. వైవీయూ అడ్మిషన్ల డైరెక్టర్ డాక్టర్ లక్ష్మీప్రసాద్ ఆధ్వర్యంలో విద్యార్థుల అర్హతా పత్రాల పరిశీలన, విద్యార్థులకు సీట్ల కేటాయింపు చేశారు. ఈ కౌన్సెలింగ్ కు వైఎస్సార్ అన్నమయ్య జిల్లాల నుంచి విద్యార్థులు హాజరయ్యారు. కౌన్సెలింగ్ కేంద్రాన్ని విశ్వవిద్యాలయ విసి ఆచార్య కె.కృష్ణారెడ్డి, పీజీ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య ఎస్. రఘునాథరెడ్డి, పరీక్షల నిర్వహణ అధికారి ఆచార్య కే.ఎస్వీ. కృష్ణారావు సందర్శించారు. ఒక విద్యార్థినికి కౌన్సెలింగు ద్వారా సీటు కేటాయింపు పత్రాన్ని వారు అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా విసి మాట్లాడుతూ జాతీయ విద్యా విధానం-2020 ప్రకారం నాలుగేళ్ల హానర్స్ డిగ్రీ పూర్తి చేసుకున్నవారికి లేటరల్ ఎంట్రీ విధానంలో ఏడాది పీజీ డిగ్రీకి తొలిసారిగా ప్రవేశాలు కల్పిస్తున్నామన్నారు. ప్రవేశాల సంచాలకుల (డైరెక్టరేట్ ఆఫ్ అడ్మిషన్) డాక్టర్ లక్ష్మీ ప్రసాద్ మాట్లాడుతూ ఫిజిక్స్, కెమిస్ట్రీ, కామర్స్, పొలిటికల్ సైన్స్ అండ్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, కంప్యూటర్ సైన్స్, ఎకనామిక్స్, జువాలజీ కోర్సుల్లో ప్రవేశాలు పొందాలని తెలిపారు. విద్యార్థుల అర్హతా పత్రాల పరిశీలనలో సహ ఆచార్యులు డాక్టర్ వి.రామకృష్ణ, డాక్టర్ ఎన్. గణేష్ నాయక్, డాక్టర్ మునికుమారి డిఒఎ విభాగ సిబ్బంది నాగమణి, జోసఫ్ పాల్గొన్నారు.

విద్యార్థులకు సూచనలు ఇస్తున్న విసి కృష్ణారెడ్డి

కుష్టు వ్యాధిపై అవగాహన అవసరం

ప్రజాశక్తి - చింతకొమ్మదిన్నె

కుష్టు వ్యాధిపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని జిలా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ నాగరాజు పిలుపునిచ్చారు. మంగళవారం చింతకొమ్మదిన్నె ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని మూలవంక గ్రామంలో నిర్వహిస్తున్న కుష్టువ్యాధి అనుమానితుల గుర్తింపు కార్యక్రమాన్ని జిల్లా కుష్టువ్యాధి నియంత్రణా అధికారి డాక్టర్ రవిబాబు, జిల్లా ఫిజియోథెరపిస్ట్ డాక్టర విక్టర్ మనోహర్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల 20 నుంచి ఫిబ్రవరి 2 వరకు కార్యక్రమం నిర్వహిస్తారని తెలిపారు. కుష్టు వ్యాధి అనుమానితుల గుర్తింపు కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించడానికి దాదాపు మూడు వేల బృందాలను ఏర్పాటు చేశామని తెలిపారు. అందులో ఒక ఆశా కార్యకర్త, ఒక స్వచ్ఛంద కార్యకర్త ఉంటారని పేర్కొన్నారు. వారు ప్రతీ ఇంటినీ సందర్శించి అనుమానితులను గుర్తిస్తారని తదుపరి అనుమానితులను స్థానిక వైద్యులు పరిశీలించి వ్యాధిని నిర్ధారిస్తారని కనుక ప్రజలు ముందుకువచ్చి ఈ బృందాలకు సహకరించాలని కోరారు. డాక్టర్ రవిబాబు మాట్లాడుతూ కుష్టువ్యాధి మైకోబాక్టీరియం లెప్రే అని సూక్ష్మ క్రిమి వల్ల చర్మానికి, నరాలకు వచ్చే వ్యాధి అని చెప్పారు. ఇది జబ్బుతో బాధపడుతున్న వ్యక్తులతో ఎక్కువకాలం కలిసి వున్నపుడు ఆరోగ్యవంతులకు సోకే ప్రమాదం ఉందని పేరన్కొన్నారు. సకాలంలో వ్యాధిగ్రస్తులను గుర్తించి చికిత్స అందిచడం ద్వారా వారికి జబ్బును నయం చేయచ్చని తెలియచేసారు. డాక్టర్ విక్టర్ మనోహర్ మాట్లాడుతూ కుష్ఠు వ్యాధి వల్ల అంగవైకల్యం సంభవించినవారికి అవసరమైన పక్షంలో పునర్నిర్మాణ శస్త్రచికిత్స చేసి ప్రభుత్వం ఆర్థిక సహాయం అందజేస్తారని తెలిపారు. కార్యక్రమంలో సమాజ ఆరోగ్య అధికారి సుకు మారన్, వారి పర్యవేక్షకులు ఆరోగ్య సహాయకులు, ఎఎన్ఎం ఆశాలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న వైద్యాధికారులు

వైవీయూ పీజీ పరీక్షలు ప్రారంభం

- తొలి రోజు 540 మంది హాజరు

ప్రజాశక్తి - కడప అర్బన్

యోగివేమన విశ్వవిద్యాలయ పోస్టు గ్రాడ్యు యేషన్ కళాశాల, అనుబంధ పీజీ కళాశాలల విద్యార్థులకు మొదటి సెమిస్టర్ పరీక్షలు మంగళవారం ప్రార ంభమ య్యాయి. వైవీయూ ప్రాంగ ణంలోని ఎపిజె అబ్దుల్ కలాం గ్రంథాలయంలో జరుగుతున్న పరీక్షలను విశ్వవిద్యాలయ విసి ఆచార్య కె. కృష్ణారెడ్డి, ప్రిన్సిపల్ ఆచార్య ఎస్.రఘునాథరెడ్డి, పరీక్షల నియంత్రణ అధికారి ఆచార్య కెఎస్‌వి కృష్ణారావు అకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థుల హాల్ టికెట్లను పరిశీలించారు. పరీక్షల నిర్వహణపై కేంద్ర సూపరింటెండెంట్ ఆచార్య కాత్యాయనిని అడిగి తెలుసుకున్నారు. పరీక్షల నిబంధనలను అనుసరించి కట్టుదిట్టంగా నిర్వహించేందుకు అన్ని రకాల జాగ్రత్తలు తీసుకున్నామని తెలిపారు. 560 మంది విద్యార్థులకు గానూ 540 మంది హాజరయ్యారని తెలిపారు. పరీక్షకు నిర్వహణలో అడిషనల్ చీఫ్ సూపరింటెండెంట్లు డాక్టర్ లక్ష్మీ ప్రసాద్, డాక్టర్ మునికుమారి సిబ్బంది పి. చంద్రమౌలి, అధ్యాపకులు పాల్గొన్నారు.

జాతీయ గిరిజన కమిషన్ సభ్యుడికి వినతిపత్రం

ప్రజాశక్తి- కడప అర్బన్

జాతీయ గిరిజన కమిషన్ సభ్యులు జాటోత్ హుస్సేన్ నాయక్ పర్యవేక్షణ లో భాగంగా కదిరి నియోజక వర్గంలోని పలు తాండలను సందర్శించారు. పర్యటనకు వచ్చిన వారిని మంగళ వారం ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం రాష్ట్ర కోశాధికారి డాక్టర్ ఐ.శివా నాయక్ ఆధ్వర్యంలో కడప జిల్లా సికెదిన్నె మండలం, జి జిహెచ్ తాండ వాసులు కలిసి వారి సమస్యను వినతి పత్రం ద్వారా తెలియజేశారు.జిఎన్ఎస్ఎస్ పరిధిలో డ్యామ్ నిర్మించి మునక ప్రాంతంకింద గిరిజన 106 కుటుంబాలకు కేవలం ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ కింద 5 సెంట్లు స్థలం కేటాయించారని తెలిపారు. వాటికి సంబందించిన గృహ నిర్మాణానికి, అభివృద్ధి కి గండి కోట కింద వున్న ప్యాకేజీ ఇస్తామని హామీ ఇచ్చి ఇప్పటికి ఎటువంటి సహాయం అందలేదని చెప్పారు. మంజూరు కాబడిన ప్యాకేజీ అందేలా చూడాలని కోరారు. దీనిపై స్పందించిన సభ్యులు త్వరలో కడప జిల్లా సంబంధించిన అధికారులకు తాకిదు పంపించి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జి జి హెచ్ తాండ వాసులు కృష్ణ నాయక్, సుధాకర్ నాయక్, గోపి నాయక్, పవన్ నాయక్ పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేస్తున్న డాక్టర్ శివ నాయక్

దూరవిద్యను సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి - కడప అర్బన్

నగరంలోని రిమ్స్ రోడ్డు ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో ఉన్న దూరవిద్య కేంద్రాన్ని నిరుద్యోగ అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని నిర్వా హకులు అశోక్ యాదవ్ కోరారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఎపిఒఎస్ఎస్, ఎన్ఐఒఎస్ ద్వారా కేవలం ఏడు నెలలలో ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ద్వారా రెండు సంవత్సరాల ఇంటర్, డైరెక్ట్ టెన్త్ క్లాస్ పూర్తి చేయవచ్చని చెప్పారు. అలాగే బికాం, బిఎ, బిఎస్‌సి, ఎంఎ, ఎంకాం, ఎంఎస్‌సి, ఎంఎస్ డబ్ల్యూ, ఎంబిఎ, ఎంసిఎ, జర్నలిజం మరిన్ని కోర్సులు ఉన్నాయని పేర్కొన్నారు. టెక్నికల్ డిప్లమా కోర్సులు ఉన్నాయని తెలిపారు. దూర ప్రాంత ఉద్యోగులకు, గృహిణులకు ఆంధ్ర యూనివర్సిటీ ద్వారా ఆన్లైన్ డిగ్రీ/ పీజీ సౌకర్యాలు ఉన్నాయని చెప్పారు. ఆన్‌లైన్ డిగ్రీలు పూర్తిగా రెగ్యులర్ సర్టిఫికెట్‌తో సమానమని పేర్కొన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాలకు, ఉద్యోగోన్నతులకు అర్హత కలిగి ఉంటాయని తెలిపారు. రెగ్యులర్ డిగ్రీతో సమానం కావడంత దేశంలో ఉన్న ఎవరైనా ఈ కోర్సులు పూర్తి చేయవచ్చని చెప్పారు. ఇంటి వద్ద నుంచే పరీక్షలు రాసుకోవచ్చని పేర్కొన్నారు. పరీక్షలు మల్టిపుల్ ఛాయిస్ క్యూస్షన్స్ విధానంలో ఉంటాయని తెలిపారు. వందశాతం పాస్ గ్యారెంటీతో మెటీరియల్ అందజేస్తామని చెప్పారు. రాష్ట్రంలోని 13 జిల్లాల్లో ఏ సెంటర్ నైనా ఎంచుకునే అవకాశం ఉందని పేర్కొన్నారు. వివరాలకు 9963095103 కోరారు.

కిసాన్ డ్రోన్‌తో పనిభారం తగ్గింపు

ప్రజాశక్తి - గోపవరం

బద్వేల్ మండలం అబ్బూ సాహెబ్‌పేటలో ఐదేళ్లకుపైగా ప్రకృతి వ్యవసాయ రైతు గోగుల రాధాకృష్ణయ్యను వ్యవసాయ సంచాలకులు ఎం. నాగరాజు అభినందించారు. మంగళవారం ఆదర్శ రైతు అవలంభిస్తున్న విధా నాలను, పరిశీలించారు. వరికి వేప నూనె పిచికారీ చేశారు. నువ్వులు, వేరుశనగ పంటలకు కూడా డ్రోన్‌తో పిచికారీ చేయడం, దీని ద్వారా పని భారం తగ్గడం తోపాటు కూలీల కొరతను అధిగమించ వచ్చును. పది నిమి షాల్లో ఎకర విస్తీర్ణంలో పిచికారి చేయవచ్చన్నారు. కార్యక్రమంలో ఏరువాక కేంద్రం సమన్వయ కర్త డాక్టర్ కె. అంకయ్య కుమార్, బద్వేల్ వ్యవసాయ డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు ఎం నాగరాజ, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది నారిబోయిన విజయ శేఖర్,రాజేష్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

అపహాస్యం చేయడం దారుణం

ప్రజాశక్తి - కడప

భారతదేశానికి స్వేచ్ఛ, స్వాతంత్ర్య 1947 ఆగస్టు 15న రాలేదని, నిజమైన స్వాతంత్ర్యం అయోధ్యలో రామ మందిరం నిర్మాణం తర్వాతే వచ్చిందని రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ ముఖ్యుడు విష్ణు మోహన్ భగవత్ అపహాస్యం చేయడం అత్యంత దారుణమని, వెంటనే ఆయనపై దేశద్రోహం కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి పఠాన్ మహమ్మద్ అలీ ఖాన్ డిమాండ్ చేశారు. కడప జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సుమారు 200 సంవత్సరాలు సుదీర్ఘ పోరాటం ద్వారా ఎందరో మహనీయుల త్యాగ ఫలితంతో దేశానికి స్వాతంత్రం సిద్ధించినట్లు పేర్కొన్నారు. బ్రిటిష్ కాలం నుంచి ఇప్పటివరకు దేశ సార్వభౌమాధికారానికి, రాజ్యాంగానికి వ్యతిరేకంగా పనిచేస్తున్న రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్‌ను వెంటనే నిషేధం విధించాలని ఆయన డిమాండ్ చేశారు. సమావేశంలో మాజీ కార్పొరేటర్ మయన రహమతుల్లా ఖాన్, బిసి సెల్ మాజీ చైర్మన్ చిన్న కులయప్ప పాల్గొన్నారు.

మాట్లాడుతున్న అలీఖాన్

సర్వే చేస్తున్న సిబ్బంది

మానసిక వ్యాధిపై సర్వే

ప్రజాశక్తి - గోపవరం

బద్వేల్ మండలం తొట్టిగారిపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని అబ్బుసపేటలో మంగళవారం ఆల్ ఇండియా మెడికల్ ఇన్స్టిట్యూషన్ మానసిక ఆరోగ్య కార్యక్రమంపై సర్వే నిర్వహించింది. కార్యక్రమంలో 13 సంవత్సరాల నుండి 17 సంవత్సరాల పిల్లలకు, 35 సంవత్సరాల పైబడిన వారికి మానసికగా ఆరోగ్య సర్వే నిర్వహించారు. ఈ సర్వేలో ఐదు టీములుగా విభజించి, మానసిక ఆరోగ్యం పైన ప్రశ్నలు అడిగారు. ప్రస్తుతం ప్రపంచంలో దేశవ్యాప్తంగానూ మానసిక ఆరోగ్య సమస్యలు ఎక్కువగా ఉండటం వల్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు సర్వే నిర్వహిస్తున్నామని నిర్వాహకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆల్ ఇండియా మెడికల్ సైన్స్ మంగళగిరి సిబ్బంది, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం తొట్టిగారిపల్లి హెల్త్ ఎడ్యుకేటర్ బి.వెంగయ్య ,హెల్త్ సూపర్‌వైజర్ కె .వెంకటమ్మ, ఎఎన్ఎం గీత, ఆశా కార్యకర్తలు బాలరాణి, రాజమ్మ, గ్రామ సర్పంచి, గ్రామ సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్‌జెడిని కలిసిన బిటిఎ నాయకులు

ప్రజాశక్తి - కడప అర్బన్

కడప జిల్లా బహుజన టీచర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు జ్యోతి రామచంద్ర బాబు, ఉపాధ్యక్షులు గూడూరు పెంచలయ్య, ప్రధాన కార్యదర్శి డాక్టర్ హరి కొండయ్య మంగళవారం పాఠశాల విద్యాశాఖ ప్రాంతీయ సంయుక్త సంచాలకులు శామ్యూల్‌ను కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు.



ఆర్‌జెడిని సన్మానిస్తున్న బిటిఎ నాయకులు

గడ్డి మందులను పరిశీలిస్తున్న ఎంపీ అవినాష్‌రెడ్డి

నష్టపోయిన రైతుకు పరిహారం అందించాలి

ప్రజాశక్తి - సింహాద్రిపురం

గడ్డి మందు పిచికారి కారణంగా నష్టపోయిన రైతు మహేశ్వర్‌రెడ్డికి పరిహారం అందించాలని కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి డిమాండ్ చేశారు. మండలంలోని రావులకొలనులో గడ్డిమందు పిచికారితో దెబ్బతిన్న నువ్వు పంటను మంగళవారం ఆయన పరిశీలించారు. అనంతరం ఎంపీ మాట్లాడుతూ దాదాపు 15 ఎకరాల్లో పంటకు నష్టం జరిగిందన్నారు. గడ్డి మందు కారణంగా ఎదుగుదల లేకుండా పోయిందని, రైతు తీవ్రంగా నష్టపోయే అవకాశం ఉందన్నారు. వ్యవసాయ శాఖ అధికారులు తక్షణమే పిచికారి చేసిన గడ్డి మందు, విత్తనాలపై సమగ్రంగా పరిశీలించి సంబంధిత డీలర్‌పై చర్యలు తీసుకోవాలన్నారు. అక్కడే ఉన్న ముద్దనూరు వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ వెంకటసుబ్బయ్యతో జరిగిన నష్టం గురించి వివరించారు. అనంతరం వ్యవసాయ శాఖ ఏడి మాట్లాడుతూ గడ్డి మందు శాంపిల్ ల్యాబ్‌కు పంపామన్నారు. శాస్త్రవేత్త బృందాలన్ని సైతం పరిశీలనకు రావాలని ఉన్నతాధికారులకు తెలిపామ ఎంపీకి వివరించారు. కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ శ్రీకాంత్‌రెడ్డి, వైసిపి జిల్లా రైతు విభాగం అధ్యక్షులు ప్రసాద్‌రెడ్డి, నాయకులు సోమేశ్వర్‌రెడ్డి, రైతు మహేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

పరికరాలను అందజేస్తున్న సంస్థ ప్రతినిధులు

ప్రభుత్వాస్పత్రికి పరికరాలు అందజేత

ప్రజాశక్తి - ఖాజీపేట

స్థానిక ప్రభుత్వ ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రానికి స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సహకారంతో ఆవేర్ గ్రూప్ సంస్థ హైదరాబాద్ వారు రూ.2 లక్షల విలువైన అత్యాధునికమైన పరికరాలను మంగళవారం అందజేశారు. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కడప రీజినల్ మేనేజర్ శ్రీవాణి కిషోర్ కుమార్‌రెడ్డి, సంస్థ చైర్మన్ మాధవన్ జీ, ప్రాజెక్ట్ డైరెక్టర్ వరుణ్, వైద్యాధికారి అయేషా సుల్తాన్, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా దాతలు మాట్లాడుతూ తమ సంస్థ తరపున సేవా కార్యక్రమాలను విస్తృతంగా అమలు చేయనున్నామని పేర్కొన్నారు. పేదలకు తమవంతు సాయం అందించడమే తమ సంస్థ ధ్యేయమని తెలిపారు.

పరీక్ష చేస్తున్న వైద్య సిబ్బంది

మందులతో కుష్టు వ్యాధి నయం

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

మందులతో కుష్టువ్యాధి నయమవుతుందని డిపిఎంఒ శివ శంకరయ్య తెలిపారు. జాతీయ కుష్టువ్యాధి నిర్మూలనా కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఇంటింటి సర్వే నిర్వహించారు. పట్టణ పరిధిలోని బుడ్డాయపల్లి, బొల్లవరంలో ఇంటింటి సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుష్టువ్యాధి లక్షణాల గురించి వివరించారు. ఆ లక్షణాలు ఎవరికైనా ఉంటే వైద్యులను సంప్రదించాలన్నారు. కరపత్రాలను పంపిణీ చేశారు. సిఒఎంవి సుబ్బారెడ్డి, ఆరోగ్య కార్యదర్శి రెబకా, గృహలక్ష్మి, ఆశాలుపాల్గొన్నారు.

వేంపల్లె : కుష్టు వ్యాధి నిర్మూలనకు అందరూ కలిసి కట్టుగా పని చేయాలని హెల్త్ ఎడ్యుకేటర్ షఫీ ఉన్నిసా బేగం పేర్కొన్నారు. మంగళవారం స్థానిక ఎపి మైనార్టీ గురుకుల బాలికల పాఠశాలలో కుష్టు వ్యాధిపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తుమ్మడం, దగ్గడం వల్ల వచ్చే బ్యాక్టీరియాతో కుష్టు వ్యాధి వ్యాపిస్తుందన్నారు. ఈ వ్యాధి లక్షణాలు కనిపించేందుకు 3 నుండి 5 సంవత్సరాలు పడుతుందన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ సుగుణమ్మ, స్టాఫ్ నర్సు అరుణ, సిహెచ్ఒ రమాదేవి, ఆరోగ్య కార్యకర్తలు నాగ స్వర్ణలత, ఆశాలు పాల్గొన్నారు.

ప్రయివేట్ స్కూల్స్‌పై చర్యలు తీసుకోవాలి : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి - చాపాడు(మైదుకూరు)

మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

విద్య విధానాలకు వ్యతిరేకంగా ఉన్న ప్రయివేట్ పాఠశాలలపై ఆశాఖ ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ఎద్దు రాహుల్ డిమాండ్ చేశారు. మైదుకూరులోని ఎస్ఎఫ్ఐ కార్యాలయంలో మంగళవారం ఆయన మాట్లాడుతూ జిల్లాలో అనేక ప్రాంతాల్లో కార్పొరేట్, ప్రయివేట్ విద్యాసంస్థలు విద్య విధానాలకు అధికారపూరితంగా ఉండడం లేదన్నారు. తద్వారా అక్కడ చదివే విద్యార్థులకు తీవ్రమైన నష్టం కలుగుతోందన్నారు. మైదుకూరు నియోజకవర్గంలో ప్రభుత్వ విద్య విధానాలకు వ్యతిరేకంగా నడుస్తున్న పాఠశాలలపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. లేని పక్షంలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆందోళన ఇస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి, సహాయ కార్యదర్శి అజయ్, జిల్లా కమిటీ సభ్యుడు లోకేష్ పాల్గొన్నారు.

చెరువు కట్ట కింద భూములపై నివేదిక ఇస్తాం

సింహాద్రిపురం : మండలంలోని హిమకుంట్ల చెరువు కట్ట కింద భూములు చాలా వరకు వ్యవసాయానికి అణువుగా లేవని, వాటి వివరాలను ప్రభుత్వానికి నివేదిక ఇస్తామని గండికోట లిఫ్ట్ ఇరిగేషన్ ఇఇ శ్రీనివాసులు తెలిపారు. మంగళవారం వ్యవసాయ శాఖ అధికారి శివమోహన్ రెడ్డి, డిప్యూటీ తహశీల్దార్ శ్రీహరిబాబుతో కలిసి ఆయన చెరువు కట్ట కింద భూములను పరిశీలించారు. ఈ సందర్భంగా ఇఇ మాట్లాడుతూ చెరువులో నీరు ఎల్లప్పుడూ ఉంటున్న కారణంగా పంట పొలాల్లో భూములు జవుకులు (నీరు ఉబికి రావడం) వస్తున్నాయన్నారు. దీంతో పంట సాగుకు అనుకూలంగా లేవన్నారు. గతంలో రైతులు ప్రభుత్వానికి విన్నవించడంతో పరిశీలించామన్నారు. పూర్తి నివేదికను త్వరలోనే ప్రభుత్వానికి తెలియజేస్తామన్నారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి ఆర్ఐ గోపాల్, జెకెఎల్ఐ జెఇ అశోక్‌రెడ్డి, వీఆర్వో వరలక్ష్మి పాల్గొన్నారు.

పొలాలను పరిశీలిస్తున్న ఇఇ శ్రీనివాసులు, అధికారులు

ప్రారంభానికి నోచని ఎన్‌టిఆర్ విగ్రహం

- నందమూరి, నారా కుటుంబ సభ్యుల కోసం ఎదురుచూపులు

ప్రజాశక్తి - వేంపల్లె

వేంపల్లెలో ఏర్పాటు చేసిన ఎన్‌టిఆర్ విగ్రహం

పులివెందుల రోడ్డులో ఏర్పాటు చేసిన మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు విగ్రహం ప్రారంభానికి నోచుకోలేదు. ఎన్‌టిఆర్ విగ్రహన్ని ఏర్పాటు చేసిన దాత నందమూరి కుటుంబ సభ్యులుచే ప్రారంభం చేయించాలని చేస్తున్న ప్రయత్నం ఫలించడంలేదు. ఈ కారణంగా చాలా ఏళ్ల నుంచి ఎన్‌టిఆర్ విగ్రహం ప్రారంభానికి నోచుకోలేదు. వేంపల్లెకు చెందిన టిడిపి నేత కల్పన లాడ్జి ఇమాంసాబ్ కుమారుడు ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ మహమ్మద్ షబ్బీర్ టిడిపిపై ఉన్న అభిమానంతో పులివెందుల-రాయచోటి-కడప బైపాస్ రోడ్డులో ఉన్న రాజీవ్‌నగర్ కాలనీ సమీపంలో తనకు ఉన్న దాదాపు 4 సెంట్ల సొంత స్థలంలో ఎన్‌టిఆర్ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ఆ స్థలం ప్రస్తుతం రూ.50లక్షలు వరకు పలుకుతోంది. అయినా ఆ స్థలాన్ని టిడిపిపై ఉన్న అభిమానంతో ఎన్‌టిఆర్ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. నందమూరి కుటుంబ సభ్యులకు ఆ విగ్రహాన్ని ప్రారంభించేందుకు సమయం దొరకలేదు. విగ్రహ ఏర్పాటుకు కూడా దాదాపు రూ.5 లక్షల ఖర్చు చేశారు. దాదాపు 8ఏళ్లుగా ఎన్‌టిఆర్ విగ్రహాన్ని ప్రారభించలేదు. నందమూరి, నారా కుటుంబ సభ్యులు ఎన్‌టిఆర్ విగ్రహాన్ని ప్రారంభించాలని స్థల, విగ్రహ దాత ఎదురు చూస్తున్నారు. రాష్ట్రంలో ఎక్కడా కూడా లక్షల విలువ చేసే సొంత స్థలాన్ని ధారాదత్తం ఇచ్చి ఎన్‌టిఆర్ విగ్రహాన్ని ఏర్పాటు చేసిన దాఖలాలు లేవు. గత వైసిపి ప్రభుత్వ పాలనలో ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో హడావిడిగా వైసిపి నేతలు వేంపల్లెలోని నాలుగు రోడ్ల కూడలిలో వైఎస్ఆర్ విగ్రహన్ని పెట్టి ప్రారంభించారు. గతంలో జిల్లాకు టిడిపి అధినేత చంద్రబాబు, లోకేష్ వచ్చినప్పుడు ఎన్‌టిఆర్ విగ్రహాన్ని ప్రారభిస్తారని ప్రజలు, టిడిపి నేతలు భావించారు. ప్రస్తుతం మంత్రి హోదాలోనైనా లోకేష్, ఎమ్మెల్యేగానైనా బాలకృష్ణగాని ఎన్‌టిఆర్ విగ్రహాన్ని ప్రారభించాలని టిడిపి నేత ప్రయత్నం చేస్తున్నట్లు సమాచారం. వైసిపికి కంచుకోట పులివెందుల నియోజకవర్గంలోని వేంపల్లెలో టిడిపి నేతలు ధైర్యంగా ఎన్‌టిఆర్ విగ్రహాన్ని ఏర్పాటు చేసినా ప్రారభించకపోవడం చర్చనీయాంశంగా మారింది. విగ్రహం పెట్టినప్పుడే ఆ సర్కిల్‌కు ఎన్‌టిఆర్ సర్కిల్‌గా ప్రజలు నామకరణం చేశారు. ఇప్పటికైనా టిడిపి అధినేతలు జోక్యం చేసుకొని నారా, నందమూరి వంశీయులతో ఎన్‌టిఆర్ విగ్రహాన్ని ప్రారభింపజేయాలని ప్రజలు కోరుతున్నారు.

యాజమాన్య పద్ధతులు అవలంభించాలి

వరి నారును పరిశీలిస్తున్న ఎడిఎ కృష్ణమూర్తి, ఎఒ

ప్రజాశక్తి - చాపాడు

రబీ సీజన్‌లో సాగవుతున్న వరి పంటలో యాజమాన్య పద్ధతులను అవలంభించాలని మైదుకూరు వ్యవసాయ శాఖ ఎడిఎ క్రిష్ణమూర్తి సూచించారు. మంగళవారం మండలంలోని చియ్యపాడు, బసిరెడ్డిపల్లె గ్రామంలో ఆయన వరి పంట సాగును పరిశీలించారు. ఈ సందర్భంగా ఎడిఎ మాట్లాడుతూ వరి పంట సాగులో యాజమాన్య పద్ధతులతో పాటు పలు జాగ్రత్తలు తీసుకోవాలని వివరించారు. ఎరువుల వాడకం, సస్యరక్షణ వంటి అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. పంట సాగులో నత్రజనిని పూర్తిగా తగ్గించాలని సూచించారు. వరి పంటలో కాలిబాటలు తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి మ్యాగీ, గ్రామ సహాయకులు ఎం.రాము, రైతులు పాల్గొన్నారు.

ముద్దనూరు : పంట నమోదు చేసుకున్న రైతులు తప్పనిసరిగా ఇకెవైసి చేయించుకోవాలని వ్యవసాయ అధికారి వెంకట కృష్ణారెడ్డి తెలిపారు. తిమ్మాపురం గ్రామంలో మంగళవారం ఎఒ పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. అనంతరం గ్రామసభ ఏర్పాటు చేసి పంట నమోదు, ఇకెవైసి, పంట సాగు వివరాలు, పంట కోతల గురించి రైతులను అడిగి తెలుసుకున్నారు. పంట కోత దశలో ఎంపిక చేసిన పంటలు, పొలాల్లో, పంట కోత ప్రయోగాలు నిర్వహించి దిగుబడులు అంచనా వేసి, ఉన్నతాధికారులకు నివేదికలు పంపిస్తామన్నారు. శనగ, పొద్దుతిరుగుడు పంటలను పరిశీలించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో గ్రామ నాయకులు బి.ప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.

ఖాజీపేట : వ్యవసాయ శాఖలో ఆధునిక సాంకేతిక పద్ధతులను వినియోగించడం ద్వారా అధిక దిగుబడి సాధించడంతోపాటు పెట్టుబడి ఖర్చులు తగ్గించుకోవచ్చని ఎఒ నాగార్జున పేర్కొన్నారు. మంగళవారం మండల పరిధిలోని ఖాజీపేట-1, భూమాయపల్లె రైతు సేవా కేంద్రాల పరిధిలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఒ మాట్లాడుతూ సుంకేసుల గ్రామంలో రైతు గంగిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి పత్తి, మినుము పైర్లలో తక్కువ ఖర్చుతో ఎక్కువ దిగుబడి సాధించారని వివరించారు. డ్రోన్ యంత్ర పరికరం ద్వారా మందులు పిచికారీ చేయించడం వల్ల ఖర్చు, సమయం ఆదాయం అవుతుందన్నారు. మంచి ఫలితాలు లభించాయని పేర్కొన్నారు. శాస్త్ర సాంకేతిక రంగాన్ని విని యోగించి అధిక దిగుబడి సాగించడం పట్ల రైతు చంద్రశేఖర్‌రెడ్డిని ఎఒ అభినందించారు.

దిగుబడులను పరిశీలిస్తున్న ఎఒ నాగార్జున

పశువైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి - చాపాడు(మైదుకూరు) :

ఎన్.ఎర్రబల్లి గ్రామ పంచాయతీ సుంకులువారిపల్లి గ్రామంలో మంగళవారం పశువైద్య శిబిరం నిర్వహించారు. 16 పశువులకు చూడి పరీక్షలు, 24 పశువులకు గర్భకోశ వ్యాధి చికిత్సలు, 38 దూడలకు నట్టల నివారణ మందులు, 86 పశువులకు నట్టాల నివారణ మందులు, 184 పశువులకు సాధారణ చికిత్సలు, 3,418 జీవాలకు నట్టల నివారణ మందులు తాపించారు. కార్యక్రమాన్ని సర్పంచ్ నారాయణ, ఎంపిటిసి దశరదరామిరెడ్డి ప్రారంభించారు. నంద్యాలంపేట పశువైద్యాధికారి డాక్టర్ సి.గురివిరెడ్డి, జెవిఒ గోపీనాథ్. ఎహెచ్ఎ సృజన్, అనిల్, రహ్మతుల్లా, ప్రవీణ, గోపాలమిత్ర రమణ, గ్రామ రైతులు పాల్గొన్నారు. **ఆదిరెడ్డిపల్లెలో..** ముదిరెడ్డిపల్లె తండాలో పశువైద్య శిబిరం ఏర్పాటు చేశారు. వనిపెంట పశువైద్యాధికారి డాక్టర్ ఆర్.సుధాకర్, జెవిఒ ఎం.యశోద, ఎహెచ్ఎ మీరావలి, వి.మీరా కుమారి, ఎం.లావణ్య, సిబ్బంది టి.చిన్న సుబ్బారాయుడు, రైతులు పాల్గొన్నారు.

గోపవరం : గోపవరం మండలం రచాయపేట గ్రామంలో రాష్ట్రీయ గోకుల్ మిషన్‌ను మంగళవారం జిల్లా పశుసంవర్ధక అధికారి శారదమ్మ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె కృత్రిమ గర్భధారణ ద్వారా పుట్టిన 42 లేగ దూడలను పరిశీలించి, వాటిలో ఆరోగ్యవంతంగా ఉండే దూడల యజమానులకు మొదటి, రెండు, మూడో బహుమతులను ఇచ్చి రైతులను ప్రోత్సహించారు. పశువులలో ఎదకు రావడానికి ఎద లక్షణాలు వాటి ప్రాముఖ్యతను వివరించారు. లింగ నిర్వర్త వీర్యం వల్ల ఉపయోగాలు వాటిని విరి విరిగా రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో డాక్టర్ రమణయ్య, డాక్టర్ నాగభూషణం, డిఎల్‌డిఎ శివరామిరెడ్డి, కృష్ణవేణి, శిరీష, శరత్, నరసింహారెడ్డి, పశుసంవర్ధక సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ముద్దనూరు : పశు ఆరోగ్య శిబిరాల్లో పశువులు, గొర్రెలు, మేకలకు చికిత్స చేయనున్నట్లు వేల్పుచెర్ల పశు వైద్యాధికారి హిమబిందు తెలిపారు. ఉప్పలూరు గ్రామంలో మంగళవారం వేల్పుచెర్ల పశు వైద్యాధికారి హిమబిందు ఆధ్వర్యంలో పశు ఆరోగ్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ పశు ఆరోగ్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. దూడలకు, పెద్ద పశువులు, గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందు తాపించారు. సాధారణ పశువైద్య, గర్భకోశ వ్యాధి చికిత్సలు, చూడి పరీక్షలు చేసినట్లు తెలిపారు. పశుసంవర్ధక శాఖకు సంబంధించిన పలు పథకాల గురించి రైతులకు వివరించారు.

డ్రైవర్లకు కంటిచూపు ఎంతో అవసరం

- ప్రమాదాలు తగ్గించడానికి కృషి చేస్తున్నాం : డిటిసి

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

డ్రైవర్లకు కంటి చూపు ఎంతో అవసరమని, ప్రమాదాలు తగ్గించడానికి వారికి అవగాహన కల్పిస్తున్నామని డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ ఎ.చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. స్థానిక ఆర్‌టిఒ కార్యాలయంలో మంగళవారం జాతీయ రహదారి భద్రత వారోత్సవాల్లో భాగంగా వాహన డ్రైవర్లకు కంటి పరీక్షలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రైవింగ్ లైసెన్స్ ప్రయివేటీకరణ చేస్తామనడం అవాస్తవమన్నారు. గడువులోపు వాహనాలకు పన్ను చెల్లించాలని ఆయన సూచించారు. ఈనెల 31లోపు పన్నులు చెల్లించకపోతే 30 శాతం అదనంగా వసూలు చేస్తామన్నారు. పన్ను చెల్లించడంలో ఏదైనా ఆన్‌లైన్ సమస్యలు ఉంటే తమ దృష్టికి తేవాలన్నారు. ఎన్ఐసి ఆధ్వర్యంలో ఫైర్ సిబ్బంది సహకారంతో డ్రైవర్లకు అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. ఎడిటిఆర్ఒ ద్వారా డ్రైవింగ్ లైసెన్సులు ఇచ్చేందుకు ప్రొద్దుటూరులో ప్రారంభించామన్నారు. ఈ పద్ధతి వల్ల డ్రైవింగ్ బాగా చేసే వారు మాత్రమే లైసెన్స్ పొందుతారన్నారు. పులివెందుల, బద్వేల్, కడపలో కూడా త్వరలో ఈ పద్ధతిని అమలు చేస్తామన్నారు. సంక్రాంతి పండుగ సందర్భంగా తిరుగుతున్న ఫిట్నెస్, పర్మిట్‌లేని 60 వాహనాలను గుర్తించి వాటి నుంచి రూ.12 లక్షలు వసూలు చేశామన్నారు. ఎంవిఐ వెంకట ప్రసాద్ పాల్గొన్నారు.

తూతూమంత్రంగా మండల సమావేశం

ప్రజాశక్తి - పెద్దముడియం

ఎంపిపి కుమ్మరి కానపల్లె సుధా అధ్యక్షతన స్థానిక ఎంపిడిఒ కార్యాలయ సభా భవనంలో మంగళవారం మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఎంపిడిఒ శంషాద్ భాను మాట్లాడుతూ అన్ని శాఖల అధికారులతో ఇప్పటివరకు జరిగిన పలు అభివృద్ధి కార్యక్రమాలపై ఆరా తీశారు. పంటల బీమా గురించి ప్రస్తావించగా ఆ సమస్యపై వ్యవసాయ అధికారి స్పందిస్తూ వేసిన ప్రతి పంటకు ఇ క్రాప్ చేయించుకోవాలన్నారు. వితంతు పెన్షన్ అందలేదని ఎంపిడిఒ దృష్టికి తేగా త్వరలోనే వారికి పెన్షన్ అందేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఎంపిటిసిలకు వేతనాలు అందడం లేదని సభ్యులు తెలపగా.. గత నాలుగైదు నెలలుగా వేతనాలు నిలుపుదల వాస్తవమేనని, అందుకు సంబంధించిన ప్రక్రియ పూర్తయిందని, పది రోజుల్లో వేతనాలు జమవుతాయని ఎంపిడిఒ పేర్కొన్నారు. సమావేశంలో తహశీల్దార్ బాల నరసింహులు, ఇఒపిఆర్‌డి విజయభారతి, ప్రజాప్రతినిధులు, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఆపదలో ఉన్నవారికి అండగా ప్రభుత్వం

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

పేదల ఆరోగ్యానికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తున్నట్లు పులివెందుల నియోజకవర్గ ఇన్‌ఛార్జి బీటెక్ రవి సతీమణి మారెడ్డి లతారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం పులివెందుల తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నియోజకవర్గానికి చెందిన బాధిత లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను ఆమె పంపిణీ చేశారు. ఈ సందర్భంగా లతారెడ్డి మాట్లాడుతూ రాష్ట్రం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నా సీఎం చంద్రబాబు చికిత్స కోసం ఆసుపత్రులకు డబ్బు ఖర్చు చేసిన వారికి ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా చేయూతనివ్వడం హర్షించ దగ్గ విషయమన్నారు. అనంతరం లబ్ధిదారులు ముఖ్యమంత్రి చంద్రబాబుకు, బీటెక్ రవికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పులివెందుల నియోజకవర్గ కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బసిరెడ్డిపల్లె ఉపాధ్యాయుడి సస్పెన్షన్

ప్రజాశక్తి - చాపాడు

మండలంలోని బసిరెడ్డిపల్లె ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న వైవి ప్రతాప్‌రెడ్డి ని సస్పెన్షన్ చేస్తూ జిల్లా విద్యా శాఖాధికారి ఉత్తర్వులు జారీ చేశారని ఎంఇఒ రవిశంకర్ తెలిపారు. పాఠశాలకు సరిగా హాజరు కాకుండా, విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తూ, రికార్డ్స్ సక్రమంగా నిర్వహించకపోవడం, విద్యార్థులకు చదువు చెప్పకపోవడం, పరీక్ష పత్రాలు దిద్దకపోవడం వంటి కారణాలతో ప్రతాప్‌రెడ్డిని సస్పెన్షన్ చేశారని తెలిపారు.

నేటి నుంచి రోజు విడిచి రోజు నీటి సరఫరా

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

నీటి సరఫరా పైప్ లీకేజీ మరమ్మతులతో బుధవారం నుంచి నాలుగు రోజులపాటు పట్టణంలోని అన్ని ప్రాంతాలకు రోజు విడిచి రోజు నీటి సరఫరా అవుతుందని మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అమృత్ పథకం కింది పబ్లిక్ హెల్త్ శాఖ ఆధ్వర్యంలో మేజర్స్ మేఘా ఇంజనీరింగ్ వర్క్స్ ఏర్పాటు చేసిన పంపింగ్ లైన్ ధర్మాపురం గ్రామ పొలాల వద్ద లీక్ అవుతోందన్నారు. ఈ లీక్‌ను అరికట్టేందుకు పంపింగ్ నిలిపి వేయాల్సిన పరిస్థితి అనివార్యమైందన్నారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించి నీటిని పొదుపుగా వాడుకొని తమకు సహకరించాలని కమిషనర్ ఆ ప్రకటనలో కోరారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

స్థానిక కడప రోడ్డు మార్కెట్ యార్డు సమీపంలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి గాయాలయ్యాయి. ప్రొద్దుటూరుకు చెందిన చల్లా సుబ్బారెడ్డి తన వ్యక్తిగత పనుల నిమిత్తం ఎర్రగుంట్లకు వచ్చి, రోడ్డు దాటుతుండగా బొలెరో వాహనం ఢీకొంది. సుబ్బారెడ్డికి గాయాలయ్యాయి. స్థానికులు 108 వాహనంలో ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

వేంపల్లె ఆర్‌టిసి బస్టాండును పరిశీలిస్తున్న తులసిరెడ్డి

ఆర్‌టిసి బస్టాండ్‌ను త్వరగా ప్రారంభించాలి

ప్రజాశక్తి - వేంపల్లె

ప్రయాణికుల సౌకర్యార్థం వేంపల్లెలో నూతనంగా నిర్మించిన ఆర్‌టిసి బస్టాండును త్వరగా కూటమి ప్రభుత్వం ప్రారభించాలని పిసిసి అధికార ప్రతినిధి డాక్టర్ తులసిరెడ్డి కోరారు. ఆర్‌టిసి బస్టాండును మంగళవారం ఆయన కాంగ్రెస్ నాయకులతో కలిసి పరిశీలించారు. బస్సు కోసం వేచి ఉన్న ప్రయాణికుల, బస్సు డ్రైవర్లు, కండక్టర్ల ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం తులసిరెడ్డి మాట్లాడుతూ వేంపల్లె, చక్రాయపేట, వేముల, పెండ్లిమర్రి, వీరపునాయునిపల్లె మండలాలకు వేంపల్లె ప్రధాన కూడలి అన్నారు. వేంపల్లె బస్టాండు నిరంతరం ప్రయాణికులతో రద్దీగా ఉంటుందన్నారు. బస్టాండ్ సర్వాంగ సుందరంగా తయారై 3 నెలలు కావస్తున్నా ఇంకా ప్రారంభానికి నోచుకోలేదన్నారు. ఉమ్మడి కడప జిల్లాలోనే రవాణా శాఖ మంత్రి ఉండి కూడా బస్టాండును ప్రారభించకపోవడం శోచనీయమన్నారు. మరుగుదొడ్లు లేక కండక్టర్లు, డ్రైవర్లు, మహిళ ప్రయాణికులు చాలా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు అమర్నాథరెడ్డి, ఉత్తన్న, రమణ, నాగరాజు ఉన్నారు.

ద్విచక్ర వాహనాల తనిఖీలో సిఐ నరేష్‌బాబు

హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలి

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని సిఐ నరేష్‌బాబు తెలిపారు. హెల్మెట్ వాడడం వల్ల ప్రమాదం జరిగినా చిన్నచిన్న గాయాలతో ప్రాణాపాయం నుంచి బయట పడొచ్చన్నారు. ప్రొద్దుటూరు బైపాస్ రోడ్డు కూడలిలో మంగళవారం ఆయన వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ పిల్లలకు ద్విచక్ర వాహనాలు ఇస్తే వారికి అవగాహనలేక మితిమీరిన వేగంతో వెళుతూ ప్రమాదాలకు కారణమవుతున్నారని తెలిపారు. అతివేగం, ఫోన్ మాట్లాడుతూ వాహనాన్ని నడపరాదన్నారు. పేకాట ఆడే వారిపై, నిర్వహించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అసాంఘిక కార్యకలాపాలపై కఠిన చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఎర్రగుంట్ల నాలుగు రోడ్ల కూడలిలో ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. తద్వారా ప్రమాదాలు తగ్గుతాయని వివరించారు. రాత్రి 10 గంటల తర్వాత దుకాణాలను మూసి వేయిస్తున్నామన్నారు. పట్టణంలో దొంగతనాలు జరగకుండా రాత్రి వేళల్లో పోలీసులు గస్తీ నిర్వహిస్తున్నారని తెలిపారు. ప్రజలు ఇళ్లకు తాళాలు వేసి ఎక్కడికైనా వెళ్లేటప్పుడు పోలీసులకు తెలియజేస్తే నిఘా ఏర్పాటు చేస్తామన్నారు.

పారిశుధ్య సమస్యలు తలెత్తరాదు

- సర్పంచ్ రాచినేని శ్రీనివాసులు

ప్రజాశక్తి - వేంపల్లె

రోడ్డుపై పారుతున్న మురుగునీటిని పరిశీలిస్తున్న సర్పంచ్

వేంపల్లెలో పారిశుధ్య సమస్యలు తలెత్తరాదని సర్పంచ్ రాచినేని శ్రీనివాసులు పేర్కొన్నారు. చెత్తను తొలగించి పారిశుధ్య సమస్యలు లేకుండా చేయాలని ఆయన సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం పంచాయతీ కార్యదర్శి సుబ్బారెడ్డితో కలిసి సర్పంచ్ వేంపల్లెలోని శ్రీరాంనగర్ కాలనీలో పర్యటించారు. అక్కడ లీక్ అవుతున్న తాగునీటి పైపులైన్‌ను పరిశీ లించారు. వెంటనే మర్మతులు చేయించాలని ఇఒను ఆదేశించారు. వీధుల్లో మురుగు నీరు రోడ్లపై ప్రవహించకుండా పారిశుధ్య పనులు చేపట్టాలన్నారు. కొత్త ప్రాంతాలకు తాగునీటి పైపులైన్ వేయాలని ఆయా ప్రాంతాల ప్రజలు సర్పంచ్ దృష్టికి తెచ్చారు. ఇందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని సర్పంచ్ చెప్పారు. ప్రతి రోజూ ప్రజల నుండి పారిశుధ్యంపైనే ఎక్కువగా ఫిర్యాదులు వస్తున్నట్లు చెప్పారు. వేసవి కాలం రాక ముందే నీటి ఎద్దడి రాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే అలాంటి సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వార్డు మెంబరు సునీల్, వైసిపి నాయకులు శ్రీను, దివాకర్ రెడ్డి, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రశాంతంగా అనంతపురం విఒఎ ఎన్నిక

ప్రజాశక్తి - చాపాడు

మండల పరిధిలోని అనంతపురం గ్రామంలో మంగళవారం మహిళా సంఘాల విఒఎ ఎన్నికను నిర్వహించారు. జిల్లా కమిటీ సభ్యులు హజీర, సహదేవ అధ్యక్షతన గ్రామ సమైక్య సమావేశాన్ని నిర్వహించారు. గతంలో విఒఎగా పనిచేస్తున్న ఈశ్వరమ్మను తొలగించి ఆమె స్థానంలో కే ఓబుళమ్మను నియమించాలని సభ్యులు కోరారు. ఆ మేరకు ఓబులమ్మను ఎన్నుకున్నారు. సమావేశంలో 24మంది మహిళా సంఘాల సభ్యులు ఉండగా 21 మంది హాజరైనారు. 8మంది సభ్యులు విఒఎను ఎందుకు తొలగిస్తున్నారు తమకు సమావేశం అవసరం లేదని వెనుదిరిగి వెళ్లిపోయారు. 13 మంది సభ్యులతో సమావేశాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో వెలుగు సిసి జీవన్, సిబ్బంది నాగన్న, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు. ఎస్ఐ చిన్న పెద్దయ్య ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది బందోబస్తు ఏర్పాటు నిర్వహించారు.

విజేత జెస్సీకి ఘన సన్మానం



బ్రహ్మంగారిమఠం :స్థానిక బాలికల పాఠశాలలో తొమ్మిదవ తరగతి చదువుతూ ఇండోనేషియాలో జరిగిన 2025 సౌత్ ఏషియా జంప్ రోప్ చాపియన్ షిప్‌లో బంగారు పథకం సాధించిన చిత్రాల జెస్సీని టిడిని మండల నాయకులు సుబ్బారెడ్డి, ఎల్లటూరు సాంబశివారెడ్డి, పూజా శివయ్య, ఎస్ఆర్ శ్రీనివాసులరెడ్డి, బోలా శ్రీనివాసులు, మలినేని రామయ్య, గోవిందాయపల్లె శ్రీరాములు, పురుషోత్తం రెడ్డి, సొమిరెడ్డిపల్లి నారాయణ, సోమిరెడ్డిపల్లె చలపతి, కానిస్టేబుల్ రమణ అభినందిస్తూ, సన్మానించారు. శ్రీనువాసుల రెడ్డి రూ.20వేలు నగదు జెస్సీకి అందజేశారు. కార్యక్రమంలో ఎంఇఒ పుల్లయ్య, పాఠశాల యాజమాన్యం ఊర్మిల దేవి, తెలుగు ఉపాధ్యాయుడు లెక్కల కొండారెడ్డి పాల్గొన్నారు.

స్వచ్ఛ ప్రొద్దుటూరుకు సహకరించాలి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

స్వచ్ఛ ప్రొద్దుటూరుకు ప్రజలు సహకరించాలని, ఆరోగ్యానికి మూలం పరిశుభ్రత అని మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున తెలిపారు. పలు వార్డులను మంగళవారం ఆయన పరిశీలించారు. పారిశుధ్యంపై అవగాహన కల్పించారు. వార్డు శానిటేషన్ ఎన్విరాన్‌మెంటల్ కార్యదర్శికి ఇంటింటి చెత్తసేకరణపై క్షేత్రస్థాయిలో అమలు విధానం గురించి సూచనలిచ్చారు. వసంతపేట, నేతాజీ నగర్ పరిసర ప్రాంతాల్లో పారిశుధ్య పనులను పరిశీలించారు. బంగారయ్య కొట్టాలలో ఉన్న చెత్త పాయింట్‌ను పారిశుధ్య కార్మికుల ద్వారా శుభ్రం చేయించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్లు నూర్‌బాషా, గోవిందరెడ్డి పాల్గొన్నారు.